సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 1 । జనవరి । 2024



ఆదిలాబాద్‌లో న్యూ ఇయర్ సంబరాల్లో మహిళలు, చిన్నారులు



కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



స్టెప్పులేస్తున్న యువతులు, మహిళలు



నయా.. జోష్

కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కనుమరుగైంది. మంచి, చెడులను జ్ఞాపకాలుగా మిగిల్చింది. జిల్లా వాసులు 2023కు ఘనంగా వీడ్కోలు పలికారు. నయా జోష్ మొదలైంది. కొత్త ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను మోసుకొని వచ్చిన 2024కు ఘన స్వాగతం పలికారు జిల్లా వాసులు. యువ ఆలోచనలు వెల్లివిరిసేలా.. అనుభవాల మార్గదర్శనలో.. నవశకానికి నాంది పలికేలా.. విజయ సోపానాలు వీడకుండా.. లక్ష్యాలను సాధించాలని కోరుకుంటూ హ్యాపీ న్యూ ఇయర్.



న్యూస్‌రీల్

లక్ష మందితో గురుకృప దినోత్సవం



మాట్లాడుతున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద జనవరి 11న లక్ష మందితో గురుకృప దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే వేడుకలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి బంజారాలు భారీగా తరలివస్తారన్నారు. జగదాంబ దేవి, శ్రీ సంత్ రామారావు మహారాజ్ మందిరాల్లో పూజల అనంతరం దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్‌ను దర్శించుకుంటారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. కార్యక్రమం నిర్వహణ కోసం ఆదిలాబా ద్ ఉమ్మడి జిల్లాకు చెందిన కొంతమందితో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, సర్పంచ్ రాథోడ్ సుభద్రబాయి, తదితరులు పాల్గొన్నారు.

'నూతన' ఆశయాలతో..

- కొత్త ఏడాదిలో ముందుకు
- పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం
- జిల్లా ప్రగతికి చేయూతనిస్తామన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

ఆదిలాబాద్‌టౌన్: న్యూ ఇయర్ వచ్చేసింది. కొత్త ఆశలను మోసుకొచ్చింది. ఈ ఏడాది అందరికి శుభాలు కలగాలని కోరుకుంటున్నారు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు. నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. ఇందు కోసం తమవంతు పాత్ర పోషిస్తామంటున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే..



యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం..



నూతన సంవత్సరంలో ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. విద్య, వైద్య పరంగా ప్రత్యేక దృష్టి సారిస్తాం. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తాం. న్యూ ఇయర్‌లో ప్రతి ఒక్కరు సన్మార్గంలో పయనిస్తూ ఉన్నతంగా ఎదిగాలని ఆకాంక్షిస్తున్నా.

– రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్

ప్రజల భద్రతే ముఖ్యం..



ప్రజల భద్రతే ముఖ్యం. వారి ఆస్తులు కాపాడే బాధ్యత కూడా పోలీసులపై ఉంది. గంజాయి, మట్కాపై ఉక్కుపాదం కొనసాగిస్తాం. రహదారి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం. అలాగే సైబర్ క్రైమ్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తాం. కళాశాలల్లో విద్యార్థులు గంజాయికి అలవాటు పడకుండా అవగాహక కల్పించడంతో పాటు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తాం. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

– డి.ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ


మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతలు కల్పించడమే ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా బోథ్ రెవెన్యూ డివిజన్, కుప్టి ప్రాజెక్టు, బోథ్‌లో డిగ్రీ కళాశాల, కరంజి, సిరికొండ, సిరిచెల్మ రోడ్ల నిర్మాణం చేపట్టేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతా. అలాగే బోథ్‌లో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తా. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుంది. ఆ దిశగా ప్రతి ఒక్కరూ చదువుకునేలా గ్రామాల్లో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేలా చూస్తా. ఇచ్చోడలో రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు జరిగేలా చర్యలు చేపడుతా. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతా.

– జాదవ్ అనిల్‌కుమార్, బోథ్ ఎమ్మెల్యే

అందరూ సంతోషంగా ఉండాలి



ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలి. ఈ ఏడాదిలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతా. నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించుకొని అమలుకు కృషి చేస్తా. అసెంబ్లీ సమావేశాల్లో ఈ ప్రాంత సమస్యలను ప్రస్తావిస్తా. వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతా. అలాగే ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేలా పాటుపడతా.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

లెక్క తేలింది

- 200 యూనిట్ల లోపు వినియోగదారులు 1.56 లక్షలు
- ఉన్నతాధికారులకు జిల్లా విద్యుత్‌శాఖ నివేదిక
- నెలకు రూ.4.60కోట్ల ఆర్థిక భారం



విద్యుత్ సబ్‌స్టేషన్

కైలాస్‌నగర్: జిల్లాలో 200లోపు యూనిట్ల విద్యుత్ వినియోగించే వారి లెక్క తేలింది. ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కే.వరుణ్‌రెడ్డి విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లాకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను ఆ శాఖ అధికారులు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 1లక్ష 56వేల 415 మంది వినియోగదారులు 200 యూనిట్ల కంటే తక్కువగా విద్యుత్ వినియోగిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రతినెలా 10.84 మిలియన్ యూనిట్ల వినియోగిస్తుండగా అందుకు రూ.460.11 లక్షల బిల్లులు చెల్లిస్తున్నట్లుగా లెక్క తేల్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో అలాంటి వారిలో హర్షం వ్యక్తమవుతుంది. అయితే ఇప్పటి వరకు దానిపై ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 1.67 విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో మొత్తం 1,67,896 విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటికి గాను ప్రతి నెలా 14.10 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతుంది. ఇందుకు గాను నెలా వారీగా రూ.654.74లక్షల ఆదాయం బిల్లుల రూపంలో విద్యుత్‌శాఖకు సమకూరుతోంది. ఇందులో 200 యూనిట్ల కంటే ఎక్కువగా వినియోగించే కనెక్షన్లు 11,481 ఉండగా వాటికి గాను కేవలం 3.26 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతుంది. ఈ సర్వీస్ కనెక్షన్‌దారులు ప్రతినెలా రూ.194.63 లక్షల బిల్లుల రూపంలో సంస్థకు ఆదాయం సమకూరుతోంది.

91.13 శాతం మంది 200 యూనిట్ల లోపు వారే

కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గృహజ్యోతి పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు గాను ప్రజాపాలన ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. అయితే జిల్లా విద్యుత్ వినియోగదారుల్లో 91.13 శాతం మంది 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నట్లుగా లెక్క తేలింది. వీరు 70.42 శాతం మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నట్లుగా గుర్తించారు. వీరందరికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేయనుండడంతో జిల్లాలో ఇక కేవలం 8.87 శాతం వినియోగదారులు మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కలను పరిశీలిస్తే సంస్థపై ప్రతి నెల బిల్లుల రూపంలో తీవ్ర ఆర్థిక భారం పడే అవకాశాలున్నట్లుగా ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలైతే తప్ప దీనిపై ఇంకా ఎలాంటి అభిప్రాయానికి రాలేమని అంటున్నారు. జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో ఆ ప్రక్రియ ముగిశాక గృహజ్యోతి అమలుపై స్పష్టత వచ్చే అవకాశముంటుందని తెలుస్తోంది.

మళ్లీ 'పంటల బీమా'..?

- పథకానికి ప్రభుత్వం కసరత్తు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

పంటల బీమా పథకం ద్వారా గతంలో లబ్ధి వివరాలు

సంవత్సరం	నష్టపోయిన రైతులు	అందిన పరిహారం
2017–18	28,000	రూ.142కోట్లు
2018–19, 2019–20	53,000	రూ. 312కోట్లు



గతేడాది భారీ వర్షాల కారణంగా తాంసిలో పూర్తిగా దెబ్బతిన్న పత్తి పంట

ఇచ్చోడ: వచ్చే ఖరీఫ్ నుంచి పంటల బీమా పథకాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా అమలు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో ఖరీఫ్, రబీ పంటల సాగు సమయంలో ఏటా వేల ఎకరాల్లో పంట నష్టం సంభవిస్తుంది. గతంలో ఈ పథకం అమలులో ఉండగా గత ప్రభుత్వం 2020 నుంచి వైదొలిగిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే నష్టపోయిన రైతులకు పరిహారం అందని పరిస్థితి. అయితే ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వం రైతు యూనిట్‌గా పంట బీమా పథకం అమలుకు యోచిస్తుండడం గమనార్హం.

రైతులకు లబ్ధి ఇలా...

ఏటా అకాల వర్షాలు, వడగళ్ల వానతో చేతికొచ్చిన పంటలు నష్టపోవాల్సి రావడం జిల్లా రైతులకు పరిపాటిగా మారింది. జిల్లాలో అత్యధికంగా సాగు చేసే పత్తి, సోయా పంటలపై బీమా చేసుకున్న వారికి కొంత ఆలస్యంగానైనా గతంలో పరిహారం అందింది. 2017 నుంచి 2020 వరకు పంటల బీమా ద్వారా రైతులు ఆర్థికంగా లబ్ధిపొందారు. అయితే గత ప్రభుత్వం 2020లో పంట బీమా నుంచి వైదొలగడం రైతులకు శాపంగా మారింది. జిల్లాలో 2020–21లో 18,300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే 2021–22లో 13,600 ఎకరాలు, 2022–23లో 16,290 ఎకరాల్లో పంటలు నష్టపోవాల్సి వచ్చింది. అయితే బీమా పథకం లేకపోవడంతో రైతులకు పరిహారం అందని పరిస్థితి.

రైతులను ఆదుకోవాలి

జిల్లాలో ఏటా అతివృష్టి, అనావృష్టితో రైతులు చేతికొచ్చిన పంటలను నష్టపోవాల్సి వస్తుంది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పంటల బీమా పథకం తిరిగి ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులకు షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ద్వారా కృషియల్ వెల్ఫేర్ ఫండ్ కింద మంజూరు చేయబడిన ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ప్రతీక్ (ఐఐటీ, తిరుపతి), శ్రేయ, వంశీ (ఎన్ఐటీ, వరంగల్), సుమిత్ (ఐఐఐటీ, బాసర)లో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ల్యాప్‌టాప్‌లను అందజేశారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్సీ సంక్షేమ అధికారి బి. సునీత కుమారి, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్



నియామక పత్రం అందుకుంటున్న కొండూరి గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి కేంద్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ అసోసియేషన్ సహా అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేశారు. ఆయన ఎన్నికపై సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పిప్పల్‌కోటిలో పోచమ్మ బోనాలు

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యతిరేకించాలి

ఎదులాపురం: సామ్రాజ్యవాద విష సంస్కృతిని విద్యార్థులు, యువత వ్యతిరేకించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఆత్రం వినోద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత నూతన సంవత్సర వేడుకల పేరిట మద్యం తాగి విందులు చేసుకోవడం వంటి విష సంస్కృతి ఊబిలో పడకూడదన్నారు. వాహనాలను వేగంగా నడిపి ప్రాణాలను బలి చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అశోక్, అధ్యక్షుడు శ్రీరామ్, సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి


మృతిచెందిన ఆవులను చూపిస్తున్న రైతు రాజు

జైనథ్: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృత్యువాతపడ్డాయి. వైన్స్ వెనకాల గల కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి ఆవులు మృతిచెందాయని బాధిత రైతు రాజు తెలిపాడు. తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.



కొత్త లక్ష్యం..

కొత్త ఆశలు, ఆశయాలతో యువత సిద్ధమైంది. ఈ ఏడాది కొలువు సాధించడమే తమ లక్ష్యమని అంటోంది. ప్రణాళికాబద్ధంగా చదివి గమ్యాన్ని చేరుకుంటామని చెబుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా పలువురిని 'సాక్షి' పలుకరించగా తమ మనోగతం వెల్లడించారిలా..

– నిర్మల్‌ఖిల్లా/నిర్మల్/ఆదిలాబాద్‌టౌన్

నోటిఫికేషన్లు ఇవ్వాలి



నిర్మల్: ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేరేషన్ మొదలుపెట్టాను. ఈఏడాది సీరియస్‌గా చదవాలన్న లక్ష్యంతో ఉన్నాను. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం కూడా జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇవ్వాలి. – రక్షా జాస్మిన్, బీటెక్, నిర్మల్

జాబ్ కోసం ప్రిపరేషన్



నిర్మల్: మాది కడెం మండలకేంద్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాను. నా కాళ్లపై నేను నిల్చోవాలన్న లక్ష్యంతో ఉద్యోగం కోసం ప్రిపేరవుతున్నాను. కచ్చితంగా సాధిస్తానన్న నమ్మకం ఉంది. – గ్లోరియా ఆకర్షిత, డిగ్రీ, కడెం

లక్ష్యం దిశగా శ్రమిస్తేనే



నిర్మల్‌ఖిల్లా:నిరంతరం శ్రమిస్తేనే ఉద్యోగం, వ్యాపార రంగంలో సాధించగలం. ఆత్మ విశ్వాసం కోల్పోకుండా, ఆటంకాలు ఎదురైన ముందుకు కొనసాగితే లక్ష్యం చేరుకుంటాం. యువత ఆ దిశగా ముందుకెళ్లాలి. ఈ సంవత్సరం వారు అనుకున్న లక్ష్యం నెరవేరాలి. – డాక్టర్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిర్మల్

అప్రమత్తంగా ఉండాలి



ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుతం కోవిడ్ కొత్త వేరియంట్ వ్యాపిస్తోంది. బీపీ, షుగర్, అస్తమా, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. రిమ్స్‌లో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ఎవరికీ ఆందోళన వద్దు. నూతన సంవత్సరంలో మరిన్ని నాణ్యమైన సేవలందిస్తా.
– డాక్టర్ సుమలత, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్

ఈసారి ఉద్యోగం సాధిస్తా



నిర్మల్‌ఖిల్లా:2024 ఉద్యోగ నామ సంవత్సరం కావాలని కోరుకుంటున్నా. ఈ సంవత్సరం ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా డీఎస్సీ, ఇతర గ్రూప్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు నేపథ్యంలో ఉద్యోగ లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.
– తక్కలపల్లి సునీల్ కుమార్, బీరవెల్లి

కొలువు సాధించడమే లక్ష్యం..



ఆదిలాబాద్‌టౌన్:వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయాలి. ఉద్యోగాల భర్తీతోనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కష్టపడి చదివి కొలువుల కోసం ఎదురుచూస్తున్న వారికి కొత్త ఏడాది కలిసిరావాలి. ప్రణాళిక బద్ధంగా చదివితే కొలువు సాధించవచ్చు.
– బి.అమూల్య, యువతి, ఆదిలాబాద్

ఈసారి ఎస్సై కోసం..



నిర్మల్: మాది బాన్సువాడ. భైంసా డిగ్రీకాలేజీలో ఫైనలియర్ చదువుతున్నాను. గతేడాది వరకు కానిస్టేబుల్‌కు ప్రిపేరయ్యాను. ఈ ఏడాది డిగ్రీ కంప్లీట్ అవుతుంది. ఈసారి ఎస్సై కోసం ప్రిపేర్ కావాలన్న లక్ష్యం పెట్టుకున్నాను. అందుకు తగ్గట్లు ప్రణాళికాబద్ధంగా ప్రయత్నం చేస్తాను.
– మేఘన, డిగ్రీ ఫైనలియర్, భైంసా

ఉద్యోగ సాధనే లక్ష్యం



నిర్మల్: మాది పుస్పూర్ గ్రామం. అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ చదివిస్తున్నారు. వారి కష్టానికి తగ్గట్లు చదువుతున్నాను. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా పెట్టుకుంటున్నాను. ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వాలి.
– విజేత, డిగ్రీ ఫైనలియర్, భైంసా

దృఢసంకల్పంతో..



ఆదిలాబాద్‌టౌన్:కొత్త ఏడాదిలో నా లక్ష్య సాధన కోసం మరింత దృఢంగా కృషి చేస్తాను. గతేడాది అర్ధాంతరంగా మిలిగిన పనులు ఈయేడు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తాను. గత అనుభవాలు నెమరువేసుకుని ప్రత్యేక ప్రణాళికతో ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుతాను. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆశిస్తున్నాను. – సి.కావ్య, యువతి, ఆదిలాబాద్

ముందుకు సాగాలి



ఆదిలాబాద్‌టౌన్: కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నప్పుడు క్యాలెండర్‌లో తేది మాత్రమే మారుతోంది. కానీ ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలి. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువత అనుకున్న లక్ష్యాలను నెరవేర్చే దిశగా కష్టపడి ముందుకు సాగాలి. – సాక్షి, విద్యార్థిని, ఆదిలాబాద్

నూతన ఉత్తేజంతో ముందుకు..



ఆదిలాబాద్‌టౌన్: కొత్త ఏడాదిలో నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతాను. గతేడాది అనుకున్న లక్ష్యాలు చేరుకుంటాను. ప్రభుత్వ కొలువు సాధించే దిశగా ముందుకు సాగుతాను. ఉపాధ్యాయ వృత్తిలో చేరి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం.
– కె.వైష్ణవి, ఛాత్రోపాధ్యాయురాలు



ఆపన్నహస్తం అందించరూ..

- రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న రాకేశ్

భైంసాటౌన్: అప్పటిదాక స్నేహితులతో సరదాగా గడిపిన రాకేశ్(రోబో) పరిస్థితి రోడ్డు ప్రమాదంతో ఒక్కసారిగా మారిపోయింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కాగా, ప్రస్తుతం మెరుగైన చికిత్సకు దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన రాకేశ్ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అమ్మ బీడీలు చుడుతుండగా, నాన్న బీడీ కంపెనీపై వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 29న రాత్రి స్నేహితులతో కలిసి బైక్‌పై భైంసా వైపు వస్తుండగా ఆర్టీసీ డిపో వద్ద మరో బైక్‌ను ఢీకొట్టడంతో రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలించగా అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెదడులో కొన్నిచోట్ల రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు రూ.8లక్షలకుపైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు కుటుంబీకులు, స్నేహితులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలోనని రాకేశ్ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక సహాయం అందించాలంటే..
ఫోన్‌పే/గూగుల్‌పే నంబర్ 94943 17930
ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా 52138922047

గుంతలో పడిన ఐచర్ వ్యాన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని గుంతలో ఐచర్ వ్యాన్ దిగబడింది. ఈ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ షాహిద్ వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి కోడిగుడ్లు తీసుకొని ఉత్తరప్రదేశ్‌లోని జన్షీర్ వెళ్తుంది. ఇందారం క్రాస్ రోడ్డు వద్ద వ్యాన్ డ్రైవర్ దారి తప్పి చెన్నూర్‌కు వచ్చాడు. దారితప్పి వచ్చిన విషయాన్ని స్థానికులు తెలుపడంతో వ్యాన్ తిరుగు ప్రయాణంలో నడి రోడ్డుపై గల గుంతలో పడిపోయింది. అంబేద్కర్ చౌరస్తా జనసంచారం ఉన్న ప్రాంతం కావడంతో వ్యాన్ బోల్తాపడితే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన ఆర్.శ్రీధర్(36) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని దీంతో తీవ్ర మనస్థాపంతో ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.





కళల 'రాజేంద్ర'


పేపర్‌పై దేవి విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న రాజేంద్ర

నిర్మల్‌ఖిల్లా: ఓ వ్యక్తి ఒకటి, రెండు కాదు..విభిన్న కళల్లో తన ప్రతిభ కనబరుస్తున్నాడు. ఆయనే నిర్మల్ వాసి బిట్లింగు రాజేంద్ర. అందమైన దస్తూ రితో కాలిగ్రాఫర్‌గా, సూక్ష్మ చిత్రకళతో మినీయేచరిస్ట్‌గా, కాన్వాస్‌పై పెయింటింగ్‌నూ రాణిస్తున్నారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన కళాకారుడిపై సాక్షి కథనం.


- విభిన్న కళలతో ప్రతిభ
- సూక్ష్మ చిత్రకళ, శిల్పకళల్లో రాణింపు
- ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన నిర్మల్ వాసి

ఉపాధి నిమిత్తం ముంబైలో..
జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ వాస్తవ్యుడైన బిట్లింగు రాజేంద్ర ఉపాధి నిమిత్తం ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నాడు. ఆరుపదుల వయసులో విభిన్న కళల్లో ఆరితేరి ఔరా..అనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఓ ప్రముఖ యాడ్ ఏజెన్సీలో పనిచేస్తుండగా, మరోవైపు బియ్యపు గింజలపై విభిన్న చిత్రాలు గీస్తున్నాడు.

కళలపై అభిరుచి..
రాజేంద్ర పదేళ్ల వయసులో చిత్రకళపై మక్కువ పెంచుకున్నాడు. టెన్త్ పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కంటే కళలపై ఉన్న అభిరుచిని వృత్తిగా మలుచుకున్నాడు. కాలిగ్రఫీలో ముద్రణలాగా ఉండే వీరి చేతిరాత (దస్తూరి) చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. శిల్పకళలో జీవకళ ఉట్టిపడేలా దేవతామూర్తులు, దేశనాయకుల విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. దుర్గాదేవి అమ్మవారు, బతుకమ్మ పండుగ చిత్రాలు, రామాయణం, మహాభారతం, ఇతిహాసాలు, ప్రకృతి రమణీయతను ప్రదర్శించే చిత్రాలు, దేశప్రముఖుల చిత్రపటాలు గీయడంలో ఈయనకు సాటి ఎవరూ లేరు.

భగవద్గీతతో అరుదైన గుర్తింపు
భగవద్గీతను దాదాపు 8 మిల్లీమీటర్లు, 15 మిల్లీమీటర్ల పరిమాణంలో 4 సూక్ష్మ గ్రంథాల్లో భగవద్గీత మొత్తం 18 అధ్యాయాలను సూక్ష్మీకరిస్తూ తీర్చిదిద్దాడు. సూక్ష్మగ్రంథాల్లో 18 అధ్యాయాలతోపాటు 701 శ్లోకాలు చేతిరాతతోనే గ్రంథస్తం చేశాడు. పది రోజుల్లోనే పూర్తిచేసి వారం క్రితమే హార్వర్డ్ వరల్డ్ రికార్డులో నమోదు కావడంతో అరుదైన గుర్తింపు పొందాడు. భగవద్గీత గ్రంథంలో ఒక్కొక్క చిత్రం ఒక్క మిల్లీమీటర్ పరిమాణంలో ఉండడం విశేషం. ఇంత సూక్ష్మంగా అబ్బురపర్చే చిత్రాలు గీయడం, గ్రంథాలు, శిల్పాలు, ప్రతిమలను తీర్చిదిద్దడం, కాన్వాస్ పెయింటింగ్ చేయడం ఈయన ప్రత్యేకత. బియ్యపు గింజలపై లతామంగేష్కర్, కార్గిల్ విజయం, అబ్దుల్ కలాం, తిరుమల శ్రీవేంకటేశ్వరుడు వంటి ప్రతిమలను రూపొందించారు. దేవతామూర్తుల శిల్పాలు రూపుదిద్దడం, కాన్వాస్‌లపై అందమైన వేసిన ప్రకృతి చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు సైతం అందుకున్నారు.


రాజేంద్ర రూపొందించిన మినీయేచర్ భగవద్గీత


రాజేంద్ర రాసిన చేతిరాత

అభిరుచిగా మొదలైంది



చిన్నప్పటి నుంచి అభిరుచిగా మొదలైన సూక్ష్మచిత్రకళ, కాన్వాస్‌పై పెయింటింగ్, శిల్పాలు చెక్కడంలో నిమగ్నమయ్యాను. పలు యాడ్ ఏజెన్సీలకు పనిచేశాను. కళలతో కూడిన అంశాలతో మినియేచర్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నదే నా ప్రధాన ఆకాంక్ష.
– బిట్లింగు రాజేంద్ర, కళాకారుడు, నిర్మల్







విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్


ఎంపీ సోయంకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ఇంద్రవెల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం సాధిస్తారని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థులు తోడసం వెంకటలక్ష్మి, నరసింహస్వామిలు ఆగాఖాన్ అకాడమీ హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీటు వచ్చిందుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పాఠశాలలో సమస్యలపై ప్రిన్సిపాల్ కాంబ్లే అనిల్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం పూర్తయినా అనుమతి ఇవ్వలేదని నిర్వాహకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.